www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 19 జూన్ 2023

5

ఏలూరు

లాసెట్‌లో ఉంగుటూరు విద్యార్థికి 4వ ర్యాంకు



ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరుకు చెందిన అంబటి సత్యనారాయణ(సతీష్) ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన లాసెట్ ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఆయన నూజివీడు ట్రిబుల్‌ఐటిలో బిటెక్ పూర్తి చేశారు. ఆయన తండ్రి సూర్యనారాయణ, సామాన్య రైతు. తల్లి వెంకటరమణ గహిణి. సతీష్‌ను గ్రామస్తులందరూ అభినందించారు.

చినుకు రాలదు.. విత్తు పడదు..!

జూన్ మూడో వారం ముగుస్తున్నా జాడలేని వాన

నైరుతి రుతుపవనాల మందగమనంతో వడగాల్పుల జోరు

నారుమడులు వేసేందుకు రైతులు ముందుకు రాలేని పరిస్థితి

ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి

కౌలురైతులకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు వెనుకంజ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చినుకు జాడ కోసం అన్నదాత కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. వర్షం కురిస్తే తప్ప ఖరీఫ్ సాగు ముందుకు సాగే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో చినుకు పడేదెప్పుడు.. విత్తు నాటేదెప్పుడు అంటూ రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జూన్ మూడోవారం ముగుస్తున్నా ఇప్పటికీ వర్షం జాడ లేకుండాపోయింది. నైరుతి రుతుపవనాలు మందకొడిగా కదులుతున్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. రోజురోజుకీ వడగాల్పులు పెరిగిపోతుండటంతో నారుమడులు వేయాలంటేనే రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు జిల్లాల్లోనూ దాదాపు మూడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు ఖరీఫ్‌సాగుకు సన్నద్ధమయ్యారు. విత్తనాలు సిద్ధం చేసుకుని ఖరీఫ్ సాగుకు నారుమడులు వేసేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు. జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు విడుదల చేసినా ఇప్పటి వరకూ రైతులు నారుమడులు వేయలేని పరిస్థితి నెలకొంది. అందుకు ప్రధాన కారణం వానలు కురవకపోవడమే. పంట కాలువలకు సాగునీరు విడుదల చేసినా వానలు లేకపోవడంతో వడగాల్పుల తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. రోజురోజుకీ వడగాల్పులు పెరుగుతున్నాయే తప్ప తగ్గుముఖం పట్టడం లేదు. వాన కురిస్తే తప్ప భూమి చల్లబడే పరిస్థితి లేకుండాపోయింది. ఈ తరుణంలో నారుమడులు వేసినా వడగాల్పులకు మొలకలు దెబ్బతినే ప్రమాదం ఉంది. అదే జరిగితే రెండోసారి నారుమడులు వేయాల్సిన దుస్థితి ఏర్పడనుంది. రైతు నెత్తిపై అదనపు పెట్టుబడి భారం పడనుంది. దీంతో రైతులు నారుమడులు వేసేందుకు ముందుకు రావడం లేదు. నారుమడులు సకాలంలో వేసే అవకాశం లేకపోవడంతో ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తే జూన్ నెలాఖరుకుగాని నారుమడులు పడే పరిస్థితి కన్పించడం లేదు. అదే జరిగితే జులై 25వ తేదీ తర్వాతగాని ఖరీఫ్ నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉండదు. దీంతో ఖరీఫ్ మాసూళ్లు ఆలస్యంగా వచ్చే పరిస్థితి ఉంది. ఈ పరిణామాలతో రబీ సాగు సైతం మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. సకాలంలో వర్షాలు రాకపోవడంతో ఈ ఏడాది సాగుపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది.

కౌలురైతులకు రుణాలిచ్చేందుకు ముందుకురాని బ్యాంకులు

జిల్లాలో 70 శాతానికిపైగా వ్యవసాయ సాగు కౌలురైతులే చేస్తున్నారు. ఖరీఫ్‌సాగు ప్రారంభించేందుకు రైతులు సన్నద్ధంగా ఉన్నప్పటికీ కౌలురైతులకు రుణార్హత కార్డులుగాని, పంటరుణాలుగాని అందని దుస్థితి నెలకొంది. ఈ నెల 16వ తేదీన జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గతేడాది కౌలురైతులకు 50 వేల వరకూ రుణార్హత కార్డులు ఇచ్చామని, రైతులందరికీ పంటరుణాలు పొందే అర్హత ఉన్నప్పటికీ బ్యాంకులు కేవలం 20 శాతానికి మించి కౌలురైతులకు పంటరుణాలు అందించలేదని అన్నారు. దీన్ని బట్టి కౌలురైతు పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని స్పష్టమవుతోంది. ప్రస్తుత ఖరీఫ్‌లోనూ కౌలుకార్డుల జారీ ప్రక్రియ సైతం తూతూమంత్రంగా సాగుతున్న పరిస్థితి నెలకొంది. ఈ ఏడాదైనా కౌలు రైతులందరికీ రుణార్హత కార్డులు, రుణాలు ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకపోతే కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.



మాట్లాడుతున్న ఎన్.వెంకటేశ్వర్లు

రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రపంచంలోనే అత్యుత్తమైన మన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ మౌలిక సూత్రాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం ఏలూరులో జరిగిన యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ భిన్న కులాలు, మతాలు, ఆచార వ్యవహారాలు, జాతులు కలిగిన భారతదేశాన్ని ఐక్యంగా ఉంచే ఏకైక అత్యున్నత సాధనం మన రాజ్యాంగమని చెప్పారు. 29 రాష్ట్రాలు కలిసి ఉండే ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాజ్యాంగ పీఠికలోని స్వాతంత్య్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం, లౌకికత్వం, మౌలిక సూత్రాలను ప్రభుత్వాలు చిత్త శుద్ధితో అమలు చేస్తున్నాయో లేదో ప్రజలందరూ పరిశీలించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను కాపాడుకోవాలని కోరారు. ప్రశ్నించడం, భావ ప్రకటన స్వేచ్ఛ ద్వారా ప్రజలందరికీ స్వాతంత్య్రం ఉందని దీన్ని భంగపరిచే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. భారతదేశం అందరిదీ.. మనమంతా ఐక్యమత్యంగా ఉండాలనే భావనను ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధనలో భాగంగా చెప్పాలని కోరారు. ప్రశ్నను ప్రోత్సహించని సమాజం అభివృద్ధి చెందదని, విద్యార్థులకు ప్రశ్నించేతత్వాన్ని నేర్పించాలని కోరారు. యుటిఎఫ్ ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు రాజ్యాంగ పీఠికతో కూడిన మేమెంటోను జిల్లా శాఖకు బహూకరించి మాట్లాడుతూ అంబేద్కర్ కృషి వల్ల రూపొందిన రాజ్యాంగాన్ని, దాని విశిష్టతను విద్యార్థులకు బోధించాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్ల సందర్భంగా టెక్నికల్ సమస్యల వల్ల ఇబ్బందికి గురైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు ఆర్ రవికుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు ఫ్యాప్టో చేసే కార్యాచరణను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి నివేదికను బి.సుభాషిణి, ఆర్థిక నివేదికను షేక్ ముస్తఫా అలీ ప్రవేశపెట్టారు. ఈ మధ్యంతర కౌన్సిల్ సందర్భంగా తాత్కాలికంగా జిల్లా కమిటీ నాయకత్వానికి కొన్ని సూచనలు చేశారు. ప్రస్తుత అధ్యక్షులుగా ఉన్న ఆర్.రవికుమార్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుత జిల్లా కోశాధికారిగా ఉన్న షేక్ ముస్తఫాను జిల్లా అధ్యక్షులుగా, జిల్లా సహాయ అధ్యక్షురాలిగా వి.కనకదుర్గను, జిల్లా కోశాధికారిగా జివి.రంగ మోహన్‌ని, జిల్లా కార్యదర్శిగా ఎంవి.బేతాళరావుని, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బి.మోహన్ రావుని, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులుగా సిహెచ్.పిచ్చోడిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.శ్రీనివాస్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎంవి.బేతాళరావు, జిల్లా కార్యదర్శులు పివి.సాగర్ బాబు, ఎంవి.అప్పారావు, బి.అనురాధ, ఎన్.రాం బాబు, ఎస్.సుధారాణి, ఇ.శివశంకర్, సిహెచ్.శ్రీధర్, జి.దేవానంద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనకదుర్గ పాల్గొన్నారు.

కార్యదర్శి రవికుమార్, అధ్యక్షులు ముస్తఫా అలీ

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పోలవరం పోరుకేకను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20 నుండి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ జరుగుతున్న సిపిఎం మహాపాదయాత్ర (పోలవరం పోరుకేక)ను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్ట కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా సెక్రటేరియట్ సభ్యులు ఆర్.లింగరాజు అధ్యక్షత వహించారు. అనంతరం 'పోలవరం పోరుకేక' పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్రానికి జీవనాడిగా పిలుస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగంచేసిన నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం తక్షణం పునరావాసం కల్పించి పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. నిర్వాసితుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించి తక్షణం నష్టపరిహారం చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గతేడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం ఇప్పటివరకూ చెల్లించకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విచారణ చేసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. గోదావరి వరదల నుండి రక్షణకు ప్రభుత్వం ముందుగా సహాయక చర్యలు చేపట్టాలని, నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తిగా అమలు చేసే వరకూ గ్రామాల నుండి ఖాళీ చేయకూడదని, పునరావాసకాలనీలు పూర్తయ్యే వరకూ ముంపు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగాలని కోరారు. ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతిఎకరాకూ రూ.20 లక్షలు చెల్లించాలన్నారు. సిఎం జగన్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ నిర్వాసిత కుటుంబానికి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా రూ.10.50 లక్షల పరిహారం ఇవ్వాలని, జిఒ 224 అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై జరుగుతున్న మహాపాదయాత్రకు నిర్వాసితులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, తెల్లం రామకృష్ణ, అందుగుల ఫ్రాన్సిస్, మెడియం నాగమణి, కిషోర్, పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, జి.వెంకట్రావు, తెల్లం దుర్గారావు, తుమ్మల సత్యనారాయణ, జి.రాజు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

తారెత్తిస్తున్న ఎండలు - 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు - జనం ఉక్కిరిబిక్కిరి

మండవల్లిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

ప్రజాశక్తి - మండవల్లి

భానుడు ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. గత పదిరోజులుగా సూర్యుడు నిప్పులు చెరగడంతో బయటకు రావాలంటనే వణికిపోతున్నారు. వడగాల్పులు, ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందేందుకు ప్రజలు విద్యుత్ పరికరాలను, ఆరుబయట చెట్లను ఆశ్రయిస్తున్నారు. మండలంలో సోమవారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో మధ్యాహ్నం రోడ్లపై వాహనాల రాకపోకలతో పాటు జనసంచారం పూర్తిగా స్తంభించింది. జాతీయ రహదారి, మండవల్లి ప్రధాన సెంటర్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. రాత్రి వేళల్లో మబ్బులు పట్టి చిన్నచిన్న చినుకులతో పాటు చల్లని గాలు వీయడంతో కొంత చల్లదనం వచ్చినప్పటికీ పగటిపూట సూర్యుడు నిప్పులు చెరగడంతో సాయంత్రం ఆరు గంటల వరకూ వడగాల్పులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందేందుకు విద్యుత్‌ను మితిమీరి వాడడంతో విద్యుత్ వైర్లలో సామర్థ్యం తగ్గిపోయి తెగిపడిపోతున్నాయి. దీంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు లో ఓల్టేజీ సమస్య ప్రజలను ఇబ్బందిపెడుతుంది. కరెంట్ ఉన్నప్పటికీ ఫ్యాన్లు సరిగా తిరగకపోవడంతో అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిసి వాతావరణం ఎప్పటికి చల్లబడుతుందోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

వడగాల్పులతో విలవిల

ముదినేపల్లి : మండల ప్రజలు తీవ్ర వడగాల్పులు, ఎండలతో విలవిల్లాడుతున్నారు. రోహిణి కార్తె ముగిసినా ఎండలు, వడగాల్పులు మాత్రం తగ్గడంలేదు. మండలంలో ఆదివారం 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ముదినేపల్లితో పాటు ముఖ్యవ్యాపార కూడళ్లు సింగరాయపాలెం, శ్రీహరిపురం, అల్లూరు, గురజ తదితర సెంటర్లల్లో వ్యాపార సంస్థలను 12 గంటలకు మూసివేసి తిరిగి సాయంత్రం ఐదు గంటల తర్వాత తెరుస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు ప్రజలతో పాటు పశు పక్ష్యాదులు అల్లాడుతున్నాయి. ప్రజలు వేసవి తాపానికి కూలర్లు, ఎసిలు వినియోగిస్తుండగా. పశుపోషకులు మాత్రం ఎండల తీవ్రత నుంచి పశువులను కాపాడుకునేందుకు గ్రామ ఊర చెరువుల్లో దించి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాక పశువుల పాకల్లో గాలి పంకాలు ఏర్పాటు చేసి పశువులను ఎండల భారినుంచి కాపాడుకునే చర్యలు తీసుకుంటున్నారు.

ముదినేపల్లిలో వేసవి తాపానికి చెరువులో సేద తీరుతున్న గేదెలు

ఆకట్టుకున్న 'గరికపాటి కళా పరిషత్' నాటకాలు

నాటక ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శ్రీ గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో గరికపాటి నాటక కళా పరిషత్ 11వ రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలలో భాగంగా ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో రెండో రోజు ఆదివారం పలు నాటకాలు ప్రదర్శించారు. ఇందులో శ్రీ కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్, గుడివాడ వారి 'పారిజాతం', శ్రీఅమృత లహరి థియేటర్ ఆర్ట్స్, గుంటూరు వారి 'నాన్నా నేనొచ్చేస్తా', శర్వాణీ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ, బొరివంక వారి 'నిర్జీవ నినాదం', శ్రీమణికంఠ ఆర్ట్స్, పిఠాపురం వారి 'కొత్తతరం కొడుకు' నాటికలు అలరించాయి. ఈ సందర్భంగా ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణులు డి.సుబ్బారావును, సకల కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శలాకోటి వీరయ్య, రాజేశ్వరి దంపతులను, ఆర్‌ఆర్.పేట శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ఛైర్మన్ తోలేటి శ్రీనివాస్‌ను, సాహిత్య పోషకులైన జమలాపురం రాధాకృష్ణను శ్రీగరికపాటి ఆర్ట్స్ సంస్థ తరపున సత్కరించారు. పోటీలలో గెలుపొందిన నాటికలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గరికపాటి కాళిదాసు, సినీ విజ్ఞాన విశారద ఎస్‌వి.రామారావు, కె.సాయి, గురు శర్మ, ఖాజావలి, సంకు సురేష్, గుత్తా కౌసలేంద్ర, బుద్దాల రామారావు, పలువురు కళాకారులు, కళాప్రియులు పాల్గొన్నారు.

ఆసక్తిగా సాగుతున్న నాటక సంభాషణ

దొంతవరం మాజీ సర్పంచి మృతి



అడపా సూరిరావు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఉంగుటూరు

దొంతవరం మాజీ సర్పంచి అడపా సూరిరావు (98) వయోభారంతో శనివారం మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. సూర్రావు 1970 నుంచి 1995 వరకూ ఏకథాటిగా 25 ఏళ్లపాటు సర్పంచిగా సేవలందించారు. ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్‌గా రైతులకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దొంతవరం గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఆదర్శప్రాయమని ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు అన్నారు. సూర్రావు హయాంలోనే పాఠశాలల నిర్మాణం, తాగునీటి ట్యాంకు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు విశేష కృషి చేశారన్నారు. సూర్రావు మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

నేడు స్పందన యథాతథం

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈనెల 19వతేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహించబడుతుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలల్లోనూ 'స్పందన' కార్యక్రమం ఉదయం నుంచి యథావిధిగా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

7న కుక్కలకు ర్యాబిస్ టీకాలు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రపంచ అంటు వ్యాధుల దినోత్సవం సందర్భంగా వచ్చేనెల ఏడో తేదీన కుక్కలకు ర్యాబిస్ టీకాలు వేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. మనుషులకు, ఇతర జంతువులకు ర్యాబిస్ వ్యాధి సోకకుండా కుక్కలకు పశు వైద్యశాల ఏలూరులో టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వాక్సిన్ వేయించుకోవాలని ఆయన కోరారు.

యథేచ్ఛగా ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు..!

మండవల్లి మండలంలో జాతరగా చెరువుల తవ్వకాలు - కాసుల మత్తులో అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలో ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలకు అక్రమార్కులు తెరలేపారు. దీంతో మండలంలో పొక్లెయిన్ల మోతమోగుతోంది. చెరువుల తవ్వకాలు జాతరను తలపిస్తున్నాయి. పొక్లెయిన్లు, ట్రాక్టర్లు ఆయా ప్రాంతాల్లో చక్కర్లుకొడుతూ చెరువుల జాతరను తలపిస్తుంది. రాత్రి, పగలు తేడా లేకుండా రొయ్యలు, చేపల చెరువుల తవ్వకాలు చేపడుతున్నారు. చెరువుల తవ్వకాలకు ఎలాంటి అనుమతులూ లేనప్పటికీ కాసులకు కక్కుర్తిపడిన అధికారులు ఈ అక్రమాలను చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. దీంతో పుంతలు, పోరంబోకు స్థలాలు, శ్మశాన, అనాధీన ప్రభుత్వ భూములను రొయ్యల చెరువుల్లో కలిపి తవ్వేస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమార్కుల దెబ్బకు పచ్చని పొలాలు రొయ్యలు, చేపల చెరువులుగా మారిపోతున్నాయి. కానీ ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అధికారులు కానరాకపోవడం విశేషం. అస్సలు ఇక్కడ రెవెన్యూ వ్యవస్థ ఉందా? ఉంటే ఏం చేస్తుంది? అనే ప్రశ్నలు, విమర్శలు తలెత్తుతున్నాయి. దీనికి నిదర్శనమే గన్నవరంలో అనుమతులు లేకుండా చేపట్టిన రొయ్యల చెరువుల తవ్వకాలు.

గన్నవరంలో రొయ్యల చెరువుల తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అనుమతులు లేకుండా సుమారు 60 ఎకరాల పంట భూములను ఇష్టానుసారంగా రొయ్యల చెరువులుగా తవ్వేస్తున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం రొయ్యల చెరువుల తవ్వకాలకు అనుమతులను పూర్తిస్థాయిలో నిలుపుదల చేసింది. ఈ తవ్వకాలపై సమాచారం అందినప్పటికీ అనుమతులు లేవని తెలిసి కూడా రొయ్యల చెరువుల తవ్వకాలను అడ్డుకునేలా అటువైపు కన్నెత్తి చూడకపోవడం రెవెన్యూ అధికారుల తీరుపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రొయ్యల చెరువుల తవ్వకాలను అడ్డుకోకుండా ఉండేందుకు ఎకరాకు రూ.పది వేలు చొప్పున ఇచ్చేలా రెవెన్యూ అధికారులతో ఓ మధ్యవర్తి ఒప్పందం కుదిర్చినట్లు సమాచారం. దీంతో రెవెన్యూ అధికారులు అడ్డుకోకపోవడంతో రెచ్చిపోయి శ్మశానం భూములతో పాటు పుంతలు, పోరంబోకు భూములు, పంట కాలువలను, మురుగుబోదెలను సైతం రొయ్యల చెరువుల్లో కలిపేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై కాసుల ప్రభావం ఉన్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. ప్రభుత్వ ఆస్తులకు, భూములకు భంగం కలగకుండా ప్రభుత్వ ఉత్తర్వులను తూచా తప్పకుండా అమలు చేయాల్సిన అధికారులు ఈ విధంగా కాసుల ముసుగులో చూసిచూడనట్లు వ్యవహరిస్తూ కాసుల కోసం ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కి చెరువులు తవ్వుకోవడానికి సహకరించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికీ అనధికారికంగా విచ్చలవిడిగా రొయ్యల సాగు వల్ల పర్యావరణం పాడై తాగునీటి వనరులు కలుషితమై ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందని పరిస్థితి నెలకొందని వారు స్పష్టం చేస్తున్నారు. అంతేకాకుండా రొయ్యల చెరువుల వల్ల గ్రామాల్లో బతుకుదెరువు కరువై ఉపాధి కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అనుమతుల్లేకుండా చేపట్టిన రొయ్యల చెరువు తవ్వకాలను నిలుపుదల చేసి ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. దీనిపై చెరువు తవ్వకాలకు అనుమతులున్నాయా అని తహశీల్దార్ రాజ్ కుమార్‌ను వివరణ కోరగా జాతీయ రహదారికి జగనన్న కాలనీలకు మట్టి వెళుతుందని సమాధానం చెప్పారు. సర్వేయర్‌ను పంపి రొయ్యల చెరువులు నవ్వుతున్నారో లేదో వివరాలు తెలుసుకోవాలని కలెక్టర్‌కు రిజాండర్ సమర్పిస్తానని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేటి నుంచి అడ్మిషన్లు

ప్రజాశక్తి - చింతలపూడి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బిఎ మేజర్ ఎకనామిక్స్ సైన్స్ గ్రూపుల్లో కంప్యూటర్ సైన్స్, బోటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బికం కామర్స్ మేజర్ సబ్జెక్టులుగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రతిభ గలవారికి ఎన్‌సిసి, ఎన్‌సిసిలో ప్రత్యేకమైన ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు 19వ తేదీ నుంచి కళాశాలకు వచ్చి ఆన్‌లైన్ ప్రక్రియలో ఉచితంగా రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. కళాశాలకు నాక్ బి గ్రేడ్ ఉందని తెలిపారు.

ఉమామహేశ్వరరావు ఆశయాలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఐ సీనియర్ నేత, ఎపి ప్రజానాట్యమండలి, ఎఐవైఎఫ్ నాయకులు బోగా ఉమామహేశ్వరరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఏలూరు నగరంలో సిపిఐ ప్రజానాట్యమండలి యువజన సమాఖ్యలను నిర్మించాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక 36వ డివిజన్ భగత్‌సింగ్ స్మారక గ్రంథాలయం వద్ద బోగా ఉమామహేశ్వరరావు 14వ వర్ధంతి కార్యక్రమం 36వ డివిజన్ సిపిఐ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ శాఖ కార్యదర్శి కడుపు కన్నయ్య అధ్యక్షత వహించారు. ఉమామహేశ్వరరావు చిత్రపటానికి కన్నయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. బండి వెంకటేశ్వరరావు, కడుపు కన్నయ్య, బోడెం వెంకటరావు మాట్లాడుతూ మహేష్ ఆశయాలను కొనసాగిస్తామని, 36వ డివిజన్‌లో సిపిఐని బలోపేతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు పుప్పాల కన్నబాబు, ఎఐటియుసి జిల్లా నాయకులు రెడ్డి శ్రీనివాస దాంగే, సిపిఐ నాయకులు గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వర్లు, చింతల సూర్యనారాయణ పాల్గొని బోగా ఉమామహేశ్వరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ప్రీ స్కూల్‌పై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రీ స్కూల్‌పై తల్లిదండ్రులకు అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని యాదవ బజార్‌లో ప్రీస్కూల్‌పై విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ ప్రీస్కూల్ ద్వారా చిన్నారి విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారం అందించడంతోపాటు ఆటలు, పాటలు నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆశా వర్కర్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అరటి రైతు కుదేలు

ఎండల ధాటికి వాలిపోతున్న అరటి తోటలు

తోటల్లోనే మగ్గిపోతున్న గెలలు

పెట్టుబడి ఖర్చులు కూడా రావని ఆవేదన

ఎండ ధాటికి వాలిపోతున్న అరటి తోట

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో ఎండలు 47 డిగ్రీల వరకు ఉండడంతో అరటి తోటలు మలమల మడిపోతున్నాయి. దీంతో అరటి గెలలు సైజు పెరగకపోవడంతో పాటు అరటికాయ నాణ్యత తగ్గిపోతుంది. ఇతర రాష్ట్రాలకు ఎగుమతుల ద్వారా పంపే గెలలు నాణ్యత లేకపోవడంతో సరైన ధర లేక రైతులు కుదేలవుతున్నారు. అదీకాకుండా గత రెండు వారాల క్రితం గాలిదుమ్ము వచ్చి తోటలు పడిపోగా, సగం తోటే పంట దిగుబడి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఈ నెలలో అరటి గెల రూ.260 ఉండగా, ప్రస్తుతం రూ.200 కూడా లేని పరిస్థితి. మండలంలోని 16 గ్రామాలతో పోల్చుకుంటే మండల కేంద్రమైన ముసునూరు, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, గుడిపాడు, సూరేపల్లి గ్రామాల్లో అరటి తోటలకు పెట్టింది పేరు. అరటి రకాల్లో కర్పూరం, చక్రకేళి, బుసాళి, బొంత వంటి రకాల తోటలను సాగు చేస్తున్నారు. ఇలా సాగు చేసిన అరటి ఎక్కువగా పశ్చిమబెంగాల్, బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, నేపాల్ వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. కొందరు చిరువ్యాపారులు తోపుడు బండ్లపై, మోటార్ బైకులపై కూడా రైతులు, చిన్నపాటి వ్యాపారులు అమ్మకాలు సాగించేవారు. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వాపోతున్నారు.

పడిపోయిన అరటి చెట్టు

కౌలు ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదు

కౌలు రైతు బడ్డికొట్టు వెంకటేశ్వరరావు

సంవత్సరం నుంచి ఇప్పటివరకు దుక్కులకు, అరటి మొక్కల కొనుగోలుకు, జీవ రసాయిన ఎరువులకు, క్రిమి సంహారక మందులకు, రసాయనిక ఎరువులకు, నీళ్లు పెట్టడానికి కూలీల ఖర్చు ఇలా సాగుకు రూ.3 లక్షలు అయింది. నేను కౌలు చేస్తున్న 1.60 ఎకరాల భూమి నుంచి కనీసం ఒక గెల విక్రయించడంలేదు. ఎండల ధాటికి అరటి తోటలు వాలిపోతున్నాయి. గెలలు మగ్గిపోతున్నాయి. ఎన్నో ఆశలతో అరటి సాగు చేశాం. ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా ఆశలు అడియాశలు అయ్యాయి. కనీసం కౌలు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

సగం దిగుబడి కూడా రాదు

రైతు రేగుల గోపాలకృష్ణ

నేను కొన్ని సంవత్సరాల నుంచి అరటి తోటలు సాగు చేస్తున్నాను. కాని ఈ సవత్సరం అరటి రైతులకు మరీ గడ్డు పరిస్థితి వచ్చింది. దుక్కులు సాగు చేసే సమయంలో వర్షాలు రావడంతో ఎక్కువ సార్లు దుక్కులు దున్నాల్సిన పరిస్థితి నెలకొంది. మొక్కల కొనుగోలుకు రేట్లు ఎక్కువగా ఉన్నాయి. జీవ రసాయని ఎరువులు, క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరు వుల ధరలు బాగా పెరిగిపోయాయి. పంట ధర మాత్రం పెరగకపోవడం, వాతావరణ పరిస్థితులు అనుకులంగా లేకపోవడం, అరటి తోటలు సగానికి సగం పడిపోవడంతో సగం దిగుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది.

అప్పుల బాధతోనే మిస్సింగ్ ప్లాన్..!

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని లక్కవరంలో కలకలం సృష్టించిన వ్యక్తి అదృశ్యం కేసు సుఖాంతమైంది. లక్కవరంలో అదృశ్యమైన వ్యక్తి కేరళలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి లక్కవరం రప్పించారు. ఆదివారం లక్కవరం ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరానికి చెందిన దుర్గారెడ్డి అప్పుల బాధనుంచి తప్పించుకోవడం కోసం అదృశ్య నాటకం ఆడాడని తెలిపారు. ఇటీవల అద్దెకు కారు తీసుకెళ్లిన దుర్గారెడ్డి తడికలపూడి సమీపంలో మరో కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారుకు మరమ్మతులు చేయడానికి సుమారు రూ.1.50 లక్షలు వరకు చెల్లించాల్సి వచ్చింది. ఈ క్రమంలో కారు మరమ్మతుకు చెల్లించే డబ్బులతో పాటు మరికొన్ని అప్పులు తీర్చలేక తనకు తాను అదృశ్యమైనట్లు సినీ ఫక్కీలో నాటకానికి తెర లేపాడు. ఈ క్రమంలో జంగారెడ్డిగూడెం బ్యాంకు నుంచి రూ.4.80 లక్షలు డ్రా చేసుకొని వస్తుండగా దుర్గారెడ్డి మిస్ అయినట్లు ప్రచారం అవ్వడానికి పథకం వేశారు. ఈ క్రమంలో తాను అప్పుల బాధ తాళలేక ఇబ్బంది పడుతున్నట్లు రాజమండ్రిలో తన స్నేహితులతో ఫోన్ సంభాషణలు జరిగినట్లు ఆధారాలు కల్పించారు. దుర్గారెడ్డి రెడ్డి ఆచూకీ తెలియకపోవడంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కోణంలో దుర్గారెడ్డి బ్యాంకు వద్ద డబ్బులు డ్రా చేయడంపై పోలీసులు విచారణ జరిపారు. అయితే దుర్గారెడ్డి ఖాతాలో అంత సొమ్ము లేదని వెల్లడైంది. దీంతో మరింత అనుమానం పెరిగింది. దీంతో కేసు విచారణ వేగవంతం చేసిన పోలీసులు సిడిఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో దుర్గారెడ్డి రాజమండ్రి రైల్వే స్టేషన్‌కి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడి దుర్గారెడ్డి స్నేహితులను కూడా ఆరా తీశారు. ఈ క్రమంలో దుర్గారెడ్డి శుక్రవారం రాత్రి తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను కేరళలో ఉన్నట్లు చెప్పడంతో కథ సుఖాంతమైంది. ఈ విషయం పోలీసులకు తెలియజేయగా దుర్గారెడ్డిని లక్కవరం గ్రామానికి రప్పించారు. ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు సమక్షంలో దుర్గారెడ్డిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అప్పుల బాధ తాళలేక ఇటువంటి నాటకానికి తెర తీసినట్లు దుర్గారెడ్డి ద్వారా వెల్లడి చేశారు. లక్కవరంలో దుర్గారెడ్డి అదృశ్యంపై నెలకొన్న కలకలం ఆదివారం దుర్గారెడ్డి తిరిగి రావడంతో సద్దుమణిగింది. ఆర్థిక ఇబ్బందులతో అదృశ్య నాటకానికి తెర తీసిన దుర్గారెడ్డి మరే ఇతర అఘాయిత్యానికి పాల్పడకుండా కౌన్సెలింగ్ ఇచ్చినట్లు లక్కవరం ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు.


దుర్గారెడ్డికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

యాసిడ్ బాధితురాలి చికిత్సకు ప్రభుత్వం పూర్తి సాయం

సుమారు రూ.16.40 లక్షలు ఖర్చవుతాయని తెలిపిన ఆసుపత్రి యాజమాన్యం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులో ఇటీవల యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలి వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని అత్యవసర పరిస్థితుల్లో విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రిలో వైద్య చికిత్స నిమిత్తం తరలించగా ఆసుపత్రి వర్గాలు బాధితురాలి వైద్య చికిత్సకు సుమారు రూ.16.40 లక్షలు ఖర్చు అవుతాయని తెలిపారు. బాధితురాలి కుటుంబం పేదరికం కారణంగా ఆసుపత్రి ఖర్చులు చెల్లించలేకపోవడంతో పరిస్థితిని జిల్లా అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి బాధితురాలికి ఎంత ఖర్చైనా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, వెంటనే చికిత్స చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఆసుపత్రి యాజమాన్యానికి 15వ తేదీనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎల్ఒసి, (లెటర్ అఫ్ క్రెడిట్)ను అందించింది. ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలతో బాధితురాలికి ఆసుపత్రి వర్గాలు వైద్య చికిత్సను అందిస్తున్నారు. వైద్య ఖర్చులు కాకుండా అదనంగా ఆవసరమైన ఇతర ఖర్చులకు వినియోగించుకునే విధంగా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ద్వారా బాధితురాలికి అందించే తక్షణ ఆర్థిక సహాయంలో భాగంగా మొదటి విడతగా రూ.లక్ష జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ ద్వారా శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తీసుకున్న చొరవతో బాధితురాలికి ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు ఆసుపత్రి వర్గాలతో పర్యవేక్షిస్తున్నారు.

దళితులపై జగన్ సర్కార్ యుద్ధం అమానుషం

విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు

చించినాడ పేదల దీక్షకు సంఘీభావం

సంఘీభావ సభలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరావు

ప్రజాశక్తి - యలమంచిలి

మట్టి అక్రమ తవ్వకాల ముసుగులో చించినాడలో దళితులపై జగన్ సర్కార్ యుద్ధం చేస్తుందని, లంక భూములకు డి.పట్టాలు అని ప్రభుత్వం ఒకవైపు ప్రకటిస్తూ.. మరోవైపు లంకల్లో దళితులను లాఠీలతో మోది బయటకు ఈడ్చేయడం దుర్మార్గమని విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు అన్నారు. తక్షణం పెరుగులంక భూములకు డి.ఫారం పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. చించినాడలో దళితుల దీక్షా శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విదసం ఐక్యవేదిక తరపున రాష్ట్రం నలుమూలల నుడి వచ్చిన ప్రతినిధులు పేదలనుద్దేశించి మాట్లాడారు. పోరాట కమిటీ నాయకులు కె.బాలరాజు, ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకట్రావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు సహజ న్యాయ సూత్రాలను సైతం ఉల్లంఘించి లంక భూముల్లో అనుభవదారుల ఆమోదం లేకుండా వారి భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. మట్టిని అక్రమంగా తరలించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, బాధిత దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎపి మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) రాష్ట్ర నాయకురాలు బూసి పరమేశ్వరి మాట్లాడుతూ కోర్టు ఆదేశాలకు తప్పుడు భాష్యం చెప్పి దశాబ్దాలుగా దళితుల సాగులో ఉన్న భూముల్లోకి అర్ధరాత్రి యంత్రాలు దింపి లంకను మళ్లీ గోదారిలా మార్చడంలో అధికార పార్టీ కుట్ర దాగి ఉందన్నారు. ఈ ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వమని దుయ్యబట్టారు. ఐక్యవేదిక సహాయ కన్వీనర్ సోడదాసి సుధాకర్, ఈతలపాక సుజాత మాట్లాడుతూ నదికి 200 మీటర్లలోపు తవ్వకాలు జరపకూడదని, సిఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి అధికారులే తవ్వకాలు జరిపిస్తున్నారంటే చట్టానికి దిక్కేదని ప్రశ్నించారు. చించినాడ ఘటనపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోల హరిబాబుతోపాటు వివిధ జిల్లాల నాయకులు గుబ్బల శ్రీనివాస్, నేలపూడి మోహన్‌రావు, కస్తూరి వెంకటరావు, విజయ్‌కుమార్, బల్లకుమార్, ఎస్.నూకరాజు, గంగరాజు, ముత్యాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కళారంగ ముద్దుబిడ్డ గరగ సూర్యనారాయణ కన్నుమూత

అలనాటి అగ్ర కథానాయకులతో నటించిన సూర్యనారాయణ

300కు పైగా చలనచిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టు, కమెడియన్‌గా నటన

వందల సంఖ్యలో డ్రామాల నిర్వహణతో మంచి గుర్తింపు

ప్రజాశక్తి - భీమవరం

ఆయన వేదిక ఎక్కి నటిస్తే నవరసాలు నర్తిస్తాయి... సన్నివేశానికి తగ్గట్టుగా నటించి ప్రేక్షకులను ముగ్ధులను చేయడంలో ఆయనకు ఆయనే సాటి. అలనాటి అగ్ర కథానాయకులతో నటించి సినీరంగంలో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించారు. ఆయన మరెవరో కాదు భీమవరానికి చెందిన సినీ, నాటక రంగ కళాకారుడు, అభ్యుదయవాది గరగ సూర్యనారాయణ. సూర్యనారాయణ శనివారం సాయంత్రం కన్నుమూయడంతో కళామతల్లి చిన్నబోయింది.

భీమవరంలో సూర్యనారాయణ అందరికీ అత్యంత ఆప్తులు. మంచితనానికి మారుపేరుగా ప్రతిఒక్కరితో స్నేహస్వభావం కలిగి ఉండటంలో ఆయనకు ఆయనే సాటి. సినీనాటక రంగంలో ఆయన కృషి ఎనలేనిది. అభ్యుదయ భావాలతో ముందుకు సాగిన సూర్యనారాయణ (80) శనివారం సాయంత్రం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో భీమవరం పట్టణంతోపాటు సినీ, కళా రంగాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

గరగ వెంకటనారాయణ, నాగమణి దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో మొదటి కుమారుడు గరగ సూర్యనారాయణ. అయితే వీరిది వ్యవసాయ కుటుంబం. సూర్యనారాయణ ప్రాథమిక విద్య భీమవరంలో అభ్యసించి ఉన్నత విద్యను ఆంధ్ర యూనివర్సిటీలో అభ్యసించారు. అయితే సూర్యనారాయణ చిన్ననాటి నుంచి కలలపై ఎంతో మక్కువ చూపేవారు. ఒకపక్క విద్యాభ్యాసం సాగిస్తూ అనేక డ్రామాల్లో నటించారు. సూర్యనారాయణ లక్ష్మి కమలను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు వెంకట్ ఫణి, ద్వారకానాథ్. ప్రస్తుతం వీరు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు.

కళలపై మక్కువతో అటువైపు అడుగులు

బిఎ చదివిన సూర్యనారాయణ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేసేవారు. ఈ నేపథ్యంలో పలువురి ప్రోత్సాహంతో సూర్యనారాయణ చెన్నయ్ వెళ్లారు. 1977లో దాసరి నారాయణరావు నటించిన స్వర్గం నరకం చలనచిత్రంలో సూర్యనారాయణ మొట్టమొదటిసారి నటించారు. తర్వాత ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో అనేక చిత్రాల్లో నటించారు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కమెడియన్‌గా నటించి మంచి గుర్తింపు పొందారు. హీరో శోభన్‌బాబు, అల్లు రామలింగయ్య, రావు గోపాలరావు, ఎం.ఎస్.నారాయణ వంటి కథానాయకులతో కలిసి నటించారు. పెళ్లంటే నూరేళ్లపంట, లారీ డ్రైవర్, విముక్తి కోసం, చినరాయుడు వంటి సుమారు 300 చిత్రాల్లో నటించారు. సినీ పరిశ్రమ చెన్నయ్ నుంచి హైదరాబాద్‌కు తరలొచ్చాక హైదరాబాదులో సూర్యనారాయణకు ఇంటి స్థలం దక్కింది. కళాకారుడుగా ప్రస్థానం ప్రారంభించిన సూర్యనారాయణ వందల సంఖ్యలో డ్రామాలు ప్రదర్శించారు.

సేవా కార్యక్రమాల్లో ముందు

మంచితనానికి మారుపేరుగా.. అభ్యుదయ భావాలు కలిగిన సూర్యనారాయణ సేవా కార్యక్రమాల్లో సైతం ముందుండేవారు. ముఖ్యంగా మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద జరిగే అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు.

ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సంతాపం

సూర్యనారాయణ మృతి పట్ల ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య ప్రసాద్, షేక్ వలీ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యుదయ భావాలు కలిగిన కళాకారుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. కళలపై సూర్యనారాయణకు ఉన్న మక్కువ ఎనలేనిది అన్నారు. కళాకారులు సూర్యనారాయణను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

నేరాలు - ఘోరాలు

దగ్ధమైన జామాయిల్ తోట

జామాయిల్ తోట దగ్ధం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని గొడుగువారిగూడెం ప్రాంతంలో ఉన్న చిన్నం నారాయణరావుకు చెందిన జామాయిల్ తోట అగ్నికి ఆహుతైంది. స్థానికులు అందించిన సమాచారంతో హుటాహుటిన అగ్నిమాపక శాఖ అధికారి మత్తయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ తీగలు రాపిడికి గురై నిప్పు రవ్వల పడి మంటలు చెలరేగి తోట దగ్ధమై ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. నష్టపోయిన తనను ఆదుకోవాలని బాధితుడు నారాయణరావు కోరాడు.


ఐదుగురిని అదుపులోకి తీసుకున్న నూజివీడు రూరల్ పోలీసులు

పేకాట శిబిరంపై దాడి

ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండలం సీతారాంపురం గ్రామ పంచాయితీ పరిధిలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో పేకాట, కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా జూదాలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని, సమాచారం అందించినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు ప్రజలకు సూచించారు.

సింహాద్రి అప్పారావుపేటలో...

ఆగిరిపల్లి :పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సింహాద్రి అప్పారావుపేటలో పేకాట శిబిరంపై ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,510 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంటిబాబు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నూజివీడులో మెప్మా అర్బన్ మార్కెట్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ఆదివారం మెప్మా అర్బన్ మార్కెట్ నిర్వహించారు. సభ్యులు వారు తయారుచేసిన వస్తువులను ప్రదర్శించడంతో పాటు విక్రయించారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రూ.1,02,750 విలువైన వస్తువులను విక్రయించారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహిస్తామని కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభిస్తుందని సిఎల్ఆర్‌పి జాన్సీ తెలిపారు.

'మానవత' ఆధ్వర్యాన మరిన్ని సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - చింతలపూడి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమలు చేస్తున్నట్లు మానవత జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో పొట్టి చక్రధరరావు చైతన్య హైస్కూలులో కాంద్రేగుల నాగ చిన్నారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా పుల్లూరి సోమశేఖరాచార్యులు, ఉపాధ్యక్షులుగా బివిఎస్ఎన్.రాజు, కార్యదర్శిగా అన్నవరపు రాజారావు, కోశాధికారిగా జల్లిపల్లి విశ్వేశ్వరరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా 2023 ఎస్ఎస్‌సి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన మద్రి మోక్షితకు రూ.ఐదు వేలు, జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచిన అడ్డూరి జయ స్పందనకు రూ.రెండు వేలు జిల్లా కమిటీ వారు బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా మానవత సంస్థ కార్యాలయానికి స్థలం లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను గ్రహించి డాక్టర్ బాపిరాజు మండల కమిటీకి నాలుగు సెంట్ల స్థలం విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ త్రిపుర సుందరి, జిల్లా బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ అయినాల రమణమూర్తి, ఎం.సత్యకుమార్, టి.అప్పారావు, ఎ.సత్యనారాయణ, ఎ.అప్పారావు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న క్లబ్ సభ్యులు

చేబ్రోలు లయన్స్ క్లబ్‌కు పలు అవార్డులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

జిల్లా స్థాయిలో పలు సేవా రంగాల్లో చేబ్రోలు లయన్స్ క్లబ్‌కు అనేక అవార్డులు వరించాయని ఆ క్లబ్ అధ్యక్షుడు శీతాల సత్యనారాయణ ఆదివారం వెల్లడించారు. నిడదవోలులో జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ పంకజాక్షన్, లయన్స్ పూర్వ ఇంటర్నేషనల్ డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నామన్నారు. ఈ ఏడాది చేసిన సేవలతో పాటు రూ.60 లక్షలతో నారాయణపురంలో లయన్స్ ఆడిటోరియంను అభివృద్ధి చేసినందుకు ఎక్స్‌లెన్స్ అవార్డులు వచ్చాయన్నారు. జోన్ ఛైర్మన్‌గా ప్రత్యేక జూరీ అవార్డు వంకిన ప్రతాప్, స్పెషల్ రికగ్నిషన్ అవార్డు గుణ్ణం బుల్లెబ్బాయి, ప్రత్యేక జ్యూరీ అవార్డు, గోల్డ్‌మెడల్‌ను శీతాల సత్యనారాయణలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు బొమ్మిడి అప్పారావు, ఆకుల పాండురంగ, వంకిన ధర్మారాజు, మర్నీడీ సాయిశేఖర్ పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అచ్చియ్యపాలెం పంచాయతీ కండ్రికగూడెం గ్రామానికి చెందిన 20 మంది వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారికి టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ పార్టీలో అందరూ కలిసిమెలిసి పనిచేయాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపి విజయం కోసం కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మొగపర్తి సొంబాబు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, దెయ్యాల కృష్ణమోహన్, కృష్ణ, అబ్బురి సుబ్బారావు, రాము పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **BOMMILI VIJAY KUMAR (Old Name), S/o. Srinivas Raju,** Resident of D.No. 2-37, Jangala peta, Near Ganganamma Temple, Pinkadimi Village, Eluru District Change My Name From **BOMMILI VIJAY KUMAR (Old Name) to BOMMILI VIJAYA KUMAR (New Name).** Hence forth Iam being Called as **BOMMILI VIJAYA KUMAR (New Name), S/o. Srinivas Raju** for all Purpose.